క్లుప్తంగా

అథ్లెట్ సాహిల్‌కు సన్మానం


సాహిల్‌కు శాలువా కప్పి సన్మానిస్తున్న దృశ్యం

ఏలూరు రూరల్: హన్మకొండలో ఇటీవల నిర్వహించిన సౌత్‌జోన్ అథ్లెటిక్స్ పోటీల్లో బంగారు పతకం సాధించిన కేఎస్ఎస్ సాహిల్‌ను క్రీడాభిమానులు సన్మానించారు. సోమవారం ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రిటైర్డ్ హెడ్ మాస్టర్ జల్లా వీరభద్రరావు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఎస్ఎం అక్బర్, టి వెంకటేశ్వరరావు, ఎస్‌కే సత్తార్ తదితరులు పాల్గొన్నారు. 16 ఏళ్ల విభాగంలో 100 మీటర్ల పరుగులో గోల్డ్ మెడల్ సాధించడం ప్రతి ఒక్కరిలో స్ఫూర్తి నింపిందని, కోచ్ ప్రసాద్‌కు శాలువా కప్పి అభినందించారు.

క్రైస్తవులపై దాడులు అరికట్టాలి


కేరళలో క్రైస్తవులపై దాడిని ఖండిస్తూ నిరసన ప్రదర్శన చేస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): దేశంలో క్రైస్తవులపై ఇటీవల దాడులు పెచ్చుమీరిపోతున్నాయని అటువంటి దాడులను అరికట్టి వారికి రక్షణ కల్పించాలని నగరానికి చెందిన పులువురు క్రైస్తవ సంఘ కాపరులు డిమాండ్ చేశారు. ఆదివారం కేరళ రాష్ట్రంలో క్రైస్తవులపై అనైతికంగా జరిగిన దాడిని ఖండిస్తూ సోమవారం నగరంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో తోట ఎడ్వర్డ్, సంఘ పెద్ద చుట్టుమాల మరియదాస్, చుట్టుమాల శాంతయ్య, పాలపర్తి జైపాల్, కోరు అనూష, ముక్కెల్లి విజయ, పుల్లా మమత, మెండెం శైలు, మెక్కెల్లి కమల, గుంజా మౌనిక, సిద్దనూరి భానుప్రకాష్ పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో కైకరం విద్యార్థుల ప్రతిభ

ఉంగుటూరు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో కైకరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. తాడేపల్లిగూడెం జెడ్పీ హైస్కూల్లో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో అండర్-14 విభాగంలో చెస్ పోటీల్లో విద్యార్థులు విశేష ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం గుళ్ళ ప్రసాదరావు తెలిపారు. చెస్ విభాగంలో పందిరి రోజా, ఖోఖో విభాగంలో నెక్కల లాస్యశ్రీ, ఈదుపల్లి భరత్, బాల్ బాడ్మింటన్‌లో పైడి పద్మావతి ఎంపికయ్యారని తెలిపారు. వీరికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు జి.నాగసుధ, పాపాయమ్మను హెచ్‌ఎం అభినందించారు.

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

దివ్యాంగుల అర్జీల పరిష్కారంపై కలెక్టర్ అభినందన

ఏలూరు(మెట్రో): జిల్లాలో జగనన్నకు చెబుదాం, స్పందనలో అందిన అర్జీల పరిష్కారంలో చొరవ చూపిన అధికారులను కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ ప్రత్యేకంగా అభినందించారు. సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 16 మంది దివ్యాంగులకు ఉపకరణాలను కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్, జాయింట్ కలెక్టర్ బి. లావణ్యవేణితో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం – స్పందనలో అందిన అర్జీల పరిష్కారంలో అత్యంత శ్రద్ధచూపిన వారిని అభినందించడంతోపాటు సంబంధిత అర్జీదారులకు ఆయా పరిష్కార పత్రాలను అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా దివ్యాంగుల అర్జీల పరిష్కారంలో భాగంగా ల్యాప్‌టాప్‌లు నలుగురికి, ట్రైసైకిళ్లు ఐదుగురికి, టచ్ ఫోన్ ఒకరికి, వీల్ చైర్లు ముగ్గురికి, హియరింగ్ మిషన్లు ఇద్దరికి, ఊతకర్ర ఒకరికి, కలెక్టర్, జాయింట్ కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా విభిన్న ప్రతిభావంతులు సంక్షేమశాఖ ఉప సంచాలకులు జీసీహెచ్ ప్రభాకర్, జీఎస్ డబ్ల్యూఎస్ నోడల్ ఆఫీసర్‌ను కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ కె.ఎస్.ఎస్. సుబ్బారావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.


ఏలూరు కలెక్టరేట్‌లో దివ్యాంగులకు ఉపకరణాలు అందజేస్తున్న కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్

భవన నిర్మాణ పనులు వేగవంతం చేయండి

ఏలూరు(మెట్రో): జిల్లాలో ప్రాధాన్యతా భవనాల నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలని 15 రోజులకు 100 భవనాల చొప్పున నిర్మాణ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. స్థానిక జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం ప్రాధాన్యత భవనాల నిర్మాణ ప్రగతి, నాడు–నేడు, గృహనిర్మాణం, జల్ జీవన్ మిషన్, గ్రామీణ ఉపాధి హామీ పథకం తదితర కార్యక్రమాల అమలుకు సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రాధాన్యత భవనాల నిర్మాణ లక్ష్యాలను కలెక్టర్ నిర్దేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గ్రామ సచివాలయ భవనాలు, ఆర్బీకే, వెల్‌నెస్ కేంద్రాల భవనాలను 15 రోజులకు 100 భవనాల చొప్పున నిర్మాణాలు పూర్తి చేసేలా లక్ష్యాలను నిర్దేశించామని, నిర్మాణ పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. జిల్లాలో నిర్మాణం పూర్తయిన భవనాలను సంబంధిత శాఖలకు వెంటనే అప్పగించాలని కలెక్టర్ ఆదేశించారు. జగనన్న ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. జిల్లాలోని అన్ని జగనన్న లేఅవుట్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ సుబ్బారావు, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్.ఈ లు వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, డ్వామా పీడీ రాము, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సామాజిక సాధికారత సీఎం జగనన్నతోనే సాధ్యం


సామాజిక సాధికారత పాదయాత్రలో పాల్గొన్న ఘంటా ప్రసాదరావు

ఏలూరు(మెట్రో): సామాజిక సాధికారత సీఎం జగనన్నతోనే సాధ్యమవుతుందని వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు అన్నారు. 2019 ఫిబ్రవరి 18న దెందులూరు నియోజకవర్గంలో బీసీ డిక్లరేషన్ ప్రకటించిన ముఖ్యమంత్రి ఆ మేరకు బీసీలకు సముచిత స్థానం కల్పిస్తూ పరిపాలన సాగించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సోమవారం వైఎస్సార్ సీపీ తలపెట్టిన సామాజిక సాధికారిత బస్సు యాత్రలో భాగంగా దెందులూరు నియోజకవర్గంలో భారీ స్థాయిలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పాదయాత్ర ప్రారంభ కార్యక్రమంలో ఘంటా ప్రసాదరావు మాట్లాడుతూ జగనన్న బడుగు, బలహీన వర్గాలకు ఆశా జ్యోతి అని అన్నారు. బడుగు బలహీన వర్గాలను ఇప్పటి వరకు కేవలం ఓట్ల కోసమే ఉపయోగించుకునే వారని ఆయన అన్నారు. బీసీలకు చట్ట సభల్లో పదవులు కట్టబెట్టిన ఘనత జగనన్నకే సాధ్యమని ఆయన అన్నారు. రాష్ట్రంలో బీసీల అభివృద్ధికి జగన్న ప్రభుత్వం ఎంతో చేస్తోందన్నారు. మరోమారు జగనన్న ముఖ్యమంత్రిగా విజయం సాధించి బీసీలకు భవిష్యత్తులో ఏలోటు లేకుండా చూస్తారని ఆయన అన్నారు. గత ఎన్నికల్లో బీసీలను బ్యాక్ బోన్ క్యాస్ట్‌గా చేస్తానని సీఎం జగన్ మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారని, నేడు అది పూర్తిస్థాయిలో నెరవేర్చారని ప్రసాదరావు అన్నారు. అనంతరం సామాజిక సాధికారిత బస్సు యాత్రకు భారీ పాదయాత్రగా వెళ్లి స్వాగతం పలికారు.

మానవత సేవలు అభినందనీయం


విద్యార్థులకు ఆర్థిక సహాయం అందిస్తున్న ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ జి.భానుశ్రీ లక్ష్మీ అన్నపూర్ణ ప్రత్యూష

ఏలూరు (టూటౌన్): మానవత స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని జిల్లా ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ జి.భాను శ్రీలక్ష్మి అన్నపూర్ణ ప్రత్యూష అన్నారు. స్థానిక సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హాల్‌లో మానవత ఏలూరు యూనిట్ నెలవారీ సమీక్ష సమావేశం సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ మానవత సేవలను కొనియాడారు. మరణించినా జీవించండి నినాద రూపకర్త సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్, అఖిల భారత శరీర అవయవ దాతల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గూడూరి సీతామహాలక్ష్మి మాట్లాడుతూ మరణానంతరం శరీర అవయవ దాన కార్యక్రమాలను వివరించారు. ఆర్థికంగా వెనుకబడిన 8 మంది విద్యార్థులకు మానవత జిల్లా విద్యానిధి నుంచి, సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ నుంచి ఇద్దరికి ఆర్థిక సాయం అందజేసారు. ఈ నెల 14న రాష్ట్ర ప్రభుత్వం నుంచి అబ్దుల్ కలాం పురస్కారాన్ని అందుకున్న ఎస్ఎమ్ సుబానీని సత్కరించారు. మానవత ఏలూరు యూనిట్ అధ్యక్షుడు మేతర అజయ్‌బాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కోశాధికారి పోడూరి కనకదుర్గ, డైరెక్టర్ కడియాల కృష్ణారావు సేవల వివరాలు వెల్లడించారు. సమావేశంలో మానవత విద్యానిధి కమిటీ చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు, మానవత డైరెక్టర్ దేవినేని భాస్కరరావు, ఏలూరు రీజియన్ చైర్మన్ పోలవరపు దేవ రత్నాకరరావు, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్‌వీవీఎస్ ప్రసాదరావు మాట్లాడారు. మానవత కో–చైర్మన్ మానేపల్లి సత్యనారాయణ, అడ్వైజరీ బోర్డు కమిటీ సభ్యులు నాగులపల్లి సీతామహాలక్ష్మి, ప్రొఫెసర్ పోలవరపు అపర్ణ, ఎంజీఎస్ వెంకటరత్నం పాల్గొన్నారు.

అభయ గోల్డ్ బాధితుల సమస్యలు పరిష్కరించాలి


ఏలూరు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న అభయ గోల్డ్ బాధితులు

ఏలూరు (టూటౌన్): అభయ గోల్డ్ బాధితుల సమస్యలు పరిష్కరించాలని అభయ గోల్డ్ కస్టమర్లు, ఏజెంట్ల వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ కోరారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్ఆర్‌పేట స్ఫూర్తి భవన్ నుంచి ర్యాలీగా బయలు దేరి ఆర్ఆర్‌పేట, ఫైర్ స్టేషన్, జిల్లా పరిషత్ మీదుగా కలెక్టరేట్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం అక్కడ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి ప్రభాకర్ మాట్లాడుతూ 2008లో విజయవాడ కేంద్రంగా అభయగోల్డ్ కంపెనీని స్థాపించి రెండు తెలుగు రాష్ట్రాల పరిధిలో సుమారు 4 లక్షల మంది ఖాతాదారుల నుంచి రూ.174 కోట్లు దోచుకున్నారన్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మావూరి విజయ, అడ్డగర్ల లక్ష్మీ ఇందిర మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్, తెర్లాపు శ్రీను, ఎంఏ హకీమ్, అబ్దుల్ రషీద్, కొల్లూరి సుధారాణి, జోజి మేరీ, షేక్ మీరా, కోనా శ్రీనివాసరావు, సోలాబత్తుల శ్రావణి పాల్గొన్నారు.

శాశ్వత లోక్ అదాలత్ సేవలను వినియోగించుకోవాలి


లోక్ అదాలత్ చైర్‌పర్సన్ ఏ.మేరీ గ్రేస్ కుమారి

ఏలూరు (టూటౌన్): ప్రజా ప్రయోజిత సేవల శాశ్వత లోక్ అదాలత్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని చైర్‌పర్సన్ ఏ.మేరీ గ్రేస్ కుమారి సూచించారు. స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలోని జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవన్‌లో కొవ్వూరు, నిడదవోలు నియోజకవర్గాల పరిధిలోని అధికారులతో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. శాశ్వత లోక్ అదాలత్‌కు ప్రజల్లో ఆదరణ పెరుగుతోందని వివరించారు. విద్య, వైద్యం, పోస్టల్, బీమా, రియల్ ఎస్టేట్, రవాణా, పారిశుద్ధ్యం, బ్యాంకింగ్, ఎన్ఆర్‌ఈజీఎస్, టెలికం సేవలలో లోపాలపై శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించవచ్చునన్నారు. ఈ శాశ్వత లోక్ అదాలత్‌లో ఇచ్చే తీర్పులకు అప్పీలు ఉండదని, ఎటువంటి రుసుమును చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. దీనిపై అధికారులు ప్రజలలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉందని తెలియజేసారు. కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ సభ్యులు కమ్ముల చంద్రశేఖర్ , పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలపై వినతి


మంత్రి మేరుగ నాగార్జునకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు

ఏలూరు (టూటౌన్): ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు రాజ్యాంగ బద్ధంగా పదోన్నతుల్లో రిజర్వేషన్ అములులో భాగంగా కాన్ఫిడెన్షియల్ సీనియార్టీని పరిరక్షించాలని కోరుతూ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి మేరుగ నాగార్జునకు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు సోమవారం వినతిపత్రం అందజేసారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ, ఉపాధ్యాయులు, ఆఫీసర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ అంగులూరి సర్వేశ్వరరావు, సెక్రటరీ జనరల్ గుగ్గులోతు కృష్ణ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు రాజ్యాంగ బద్ధంగా పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించారని అన్నారు. దీన్ని సుప్రీం కోర్టు, హైకోర్టులు సైతం సమర్థించాయని గుర్తు చేసారు. ఇటీవల పదోన్నతులు, రిజర్వేషన్లలో ఎంఎల్‌ఓ కమిటీ ఇచ్చిన సిఫార్సుల మేరకు రిజర్వేషన్లు తొలగించాలని చూస్తున్నారని ఇది ఆందోళనకరమన్నారు. ఈ సిఫార్సులు అమలు చేస్తే ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతారన్నారు. దీనిపై ప్రభుత్వానికి తమ తరుపున కాన్ఫిడెన్షియల్ సీనియారిటీని పరిరక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని నాయకులు మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కబడ్డీగూడెంలో పోలీస్ తనిఖీలు


కబడ్డీగూడెంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఏలూరు టూటౌన్ పోలీసులు

ఏలూరు (టూటౌన్): జిల్లా ఎస్పీ డి.మేరీప్రశాంతి, డీఎస్పీ జి. శ్రీనివాసులు ఆదేశాల మేరకు ఏలూరు టూటౌన్ సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎస్సై శుభశేఖర్ ఆధ్వర్యంలో స్థానిక కబడ్డీగూడెంలో సోమవారం రాత్రి కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. నాటుసారా తయారీ, అమ్మకాలను నివారించడం, బెల్ట్ షాపుల్లో అమ్మకాల నివారణకు, రాష్ట్ర ప్రభుత్వం నిషేధించిన ఖైనీ, గుట్కా, వివిధ పొగాకు ఉత్పత్తుల అమ్మకాలపై షాపుల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా టూటౌన్ ఎస్సై శుభశేఖర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి హానికి కలిగించే పొగాకు ఉత్పత్తులను, నాటుసారా తయారీ అమ్మకాలను అడ్డుకుంటామని తెలిపారు. మద్యం అక్రమంగా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నాటుసారా తయారీ, అమ్మకాలపై సమాచారాన్ని పోలీస్ కంట్రోల్ రూం నంబర్ 100, 112 లేదా ఏలూరు టూటౌన్ ఇన్‌స్పెక్టర్ ఫోన్ నంబర్ 9440796606, ఎస్సై నంబర్ 9381209581 సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్సై తెలిపారు.

పేదల చెంతకు ప్రభుత్వ వైద్యం

గణపవరం: పేద, మధ్య తరగతి ప్రజలకు అందని ద్రాక్షగా ఉన్న వైద్యాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చి వారికి పూర్తి ఆరోగ్య భద్రత కల్పించిందని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. సోమవారం గణపవరం మండలం కోమద్రులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వాసుబాబు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం వైద్యం ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా గ్రామాల్లో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను నిర్వహిస్తోందని అన్నారు. ప్రతి వైద్యశిబిరంలో నిపుణులైన నలుగురు వైద్యులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందిస్తున్నారని అన్నారు. ఎంపీడీవో జ్యోతిర్మయి, తహసీల్దార్ పమ్మి లక్ష్మి, ఈవోపీఆర్డీ సత్యనారాయణ, సర్పంచ్ కేశవరపు శైలజ, ఎంపీటీసీ సభ్యురాలు వడ్డి సీతామహాలక్ష్మి, డి.కె.వల్లి సర్పంచ్ తూము వీరవేణి పాల్గొన్నారు.

మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి


పాత బస్టాండ్ సెంటర్లో నినాదాలు చేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

ఏలూరు (టూటౌన్): మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని కోరుతూ చేపట్టిన రాష్ట్ర మోటారు సైకిల్ యాత్ర సోమవారం ఏలూరు చేరుకుంది. రాజమండ్రిలో సోమవారం ఉదయం ప్రారంభమైన మోటారు సైకిల్‌యాత్ర ఏలూరు చేరుకున్న సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. అనంతరం స్థానిక పాతబస్టాండ్ సెంటర్లో నిర్వహించిన బహిరంగ సభలో యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శివారెడ్డి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ మాట్లాడారు. స్మార్ట్ మీటర్లు ప్రవేశ పెట్టడం వల్ల రీడర్లు ఉపాధి కోల్పోతున్నారని, వీరికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అనంతరం స్థానిక విద్యుత్ ఎస్ఈ కార్యాలయానికి చేరుకుని ఆయనకు వినతిపత్రాన్ని అందజేసారు. ఈ కార్యక్రమలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎల్ రామకృష్ణ, జిల్లా అధ్యక్షుడు ఓ.శ్రీనివాస్, జిల్లా నాయకులు మల్లేశ్వరరావు, జి.దుర్గారావు, వి.శ్రీనివాసరావు, టి.జాకబ్, ఏ.సతీష్, వంశీ పాల్గొన్నారు.

1 నుంచి కోదండ రామాలయ ప్రతిష్ఠ మహోత్సవాలు

భీమడోలు: భీమడోలు పంచాయతీ సమీపంలో నూతనంగా నిర్మించిన శ్రీ కోదండ రామాలయం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ వేడుకలు వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ స్తపతి, తిరుమల తిరుపతి దేవస్థానం ఆగమ పండితులు రావిపాటి వెంకటప్రసాద్ అన్నారు. భద్రాద్రి సీతా రామచంద్రస్వామి ఆలయంలో కొలువైన సీతారామచంద్రస్వామి రూపంలో ఉండే విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు నవంబర్ 1 నుంచి పూజలు ప్రారంభం కానున్నాయని, 4న ఆలయంలో సీతారామచంద్ర లక్ష్మణ సమేత హనుమ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. భక్తులు, గ్రామస్తుల ఆర్థిక సాయంతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా నిర్మించారు. సోమవారం సీతారామ చంద్ర లక్ష్మణ సమేత హనుమ విగ్రహాలను మేళతాళాలతో ట్రాక్టర్‌పై వీధుల్లో ఊరేగింపు నిర్వహించి ఆలయానికి తీసుకుని వచ్చారన్నారు. స్తపతి వెంకటప్రసాద్ మాట్లాడుతూ నవంబర్ 1 నుంచి బుధవారం విఘ్నేశ్వర పూజతో ప్రతిష్ఠ కార్యక్రమాలను ప్రారంభిస్తామని తెలిపారు.

ప్రార్థనా శక్తి చాలా గొప్పది


మరియతల్లి స్వరూపంతో ఊరేగింపు నిర్వహిస్తున్న పలువురు ఫాదర్లు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రార్థనా శక్తి చాలా గొప్పదని, అనేక రుగ్మతలతో బాధపడే మానవునికి ప్రార్థన ఎంతో ప్రశాంతతనిస్తుందని ఫాదర్ పీ బాల తెలిపారు. స్థానిక గ్జేవియర్ నగర్‌లోని అమలోద్భవి కెథీడ్రల్ ఆలయంలో ఏలూరు పీఠాధిపతి బిషప్ జయరావు పొలిమేర ఆశీస్సులతో సోమవారం ఫాదర్ ఇంజమూల మైఖేల్ ఆధ్వర్యంలో యెరికో ప్రార్థనా కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా కరిస్మాటిక్ బృంద నాయకులు గాదె ప్రకాశమ్మ స్తుతి ప్రార్థన చేసి పీఠాధిపతికి కృతజ్ఞత తెలిపారు. తొలుత శిలువ, మరియతల్లి స్వరూపాలతో స్థానిక సెయింట్ గ్జేవియర్ హైస్కూల్ వద్ద నుంచి ఊరేగింపు నిర్వహించారు.ఫాదర్ బాబు జార్జి పూజ సమర్పించగా ఫాదర్ బేతంపూడి రాజు తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ జీ. మోజెస్, ఫాదర్ తాతపూడి ఇమ్మానియేలు, పాదర్ ఐ. పాల్, ఫాదర్ ఈ. జోసఫ్, నిర్మల గ్జేవియర్, డీ. అబ్రహం పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూర ప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	34
డీ.తిరుమల ఏలురు బీహెచ్‌ఈఎల్	22.15	37
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	44
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	35

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	21
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	14
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	18
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	14
ఏలూరు బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	10
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	28
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -తిరుపతి	16.00	4830	33

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర		
టమాటాలు	32	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	20	చిక్కుడు కాయలు	90
వంకాయలు (కాంతులు)	24	చామదుంపలు	40
వంకాయలు (తెలుపు)	28	ములక్కాడలు	10-12
బెండకాయలు	20	కంద	50
పచ్చిమిర్చి	44	బీట్‌రూట్	40
కాకర కాయలు	20-24	కీరా దోస	40
బీరకాయలు	24	ఫ్రెంచ్‌బీన్స్	88
క్యాబేజీ	26	అల్లం	130
క్యారెట్	38	కొత్తిమీర (కట్ట)	28
దొండకాయలు	18	పాలకూర	10
బంగాళదుంపలు	26	చుక్కకూర	10
ఉల్లిపాయలు	60	తోటకూర	10
గోరుచిక్కుడు	30	గోంగూర	07
దోసకాయలు	20	పుదీనా	05
ఆనబకాయ (1)	15- 20	క్యాప్సికమ్	74
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	30
		నిమ్మకాయలు (డజను)	--